### వట్టి పోతున్న బోరుబావి..

# ఎండి పోతున్న పంట

• కౌలు రైతు కష్టాలు • ఇప్పటి వరకు ఎకరాకు రూ. 20వేలు ఖర్చు



ఎండిన వరి పంటలో కౌలు రైతు శామప్ప

బషీరాబాద్, మార్చి 20 : ఎకరానికి రూ. 20వేలు చెల్లించి ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి పంట సాగు చేస్తే బోరు బావి వట్టి పోయి, వరి పంట ఎండిపోతుండడంతో కౌలు రైతు దిక్కు తోచని స్థితిలో పడిపోయాడు. మైల్వార్ గ్రామానికి చెందిన మున్నూరు శామప్ప రూ. లక్షా చెల్లించి ఆరు ఎకరాలు భూమిని కౌలుకు తీసుకుని వరి పంట సాగు చేశాడు. ఆరెకరాలు సాగు చేసి వరి పంట నాటేందుకు రూ. లక్ష ఖర్చు చేశాడు. అంతేకాకుండా నాటేసే సమయంలో కుటుంబం మొత్తం పొలంలోనే ఉంది. వరి పంట నాటేసిన మొదట్లో బోరు బావి నుంచి నీళ్లు బాగా రావడంతో వరి పంట మంచిగా వచ్చింది. దీంతో రైతు కౌలు కోసం అప్పు తెచ్చిన డబ్బులు తీరిపోయి ఎంతో కొంత మిగులుతాయి అనుకునే సమయంలో బోరు బావిలో నీళ్లు తగ్గి దాదాపు మూడు ఎకరాల వరకు వరి పంట ఎండిపోయింది. దీంతో రైతు శామప్ప కౌలు కోసం తెచ్చిన అప్పు, పంటకు పెట్టిన పెట్టుబడి పైన పడేటట్లు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నట్టుండి బోరు బావిలో నీళ్లు తగ్గడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని రైతు తెలిపారు.

## అంధకారంలో దోమ .. కరెంట్ లేక అవస్థలు



దోమ, మార్చి 20: మూడు గంటలపాటు కరెంటు లేక అల్లాడిన దుస్థితి దోమ మండలంలో గురువారం చోటుచేసుకున్నది. దోమ మండల కేంద్రంతో పాటుగా అనుబంధ గ్రామ మైన ఉదన్‌రావుపల్లి, లింగనపల్లి గ్రామ పంచాయతీలలో సాయంత్రం 6.30 గంటలకు పోయిన కరెంటు 9.30 గడిచినా రాకపోవడంతో మూడు గంటలు కరెంటు లేక ఆయా గ్రామాలలోని ప్రజలు అవస్థలు పడ్డారు. కరెంటు లేదు.. గతంలో విధంగా గ్యాస్ దీపాలు లేక చాలా మంది చీకట్లో మగ్గగా, మరి కొంత మంది క్యాండిల్ దీపాలు పెట్టుకొని వంటలు చేసుకున్నారు.గత పది సంవత్సరాల కాలంలో ఇలాంటి పరిస్థితి రాలేదని ప్రజలు గుర్తు చేసుకుంటూ అధికార ప్రభుత్వాన్ని నిందించారు.

## పరిగి డిపోకు 17 బస్సులు మంజూరు



కొత్త బస్సులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, మార్చి 20: పరిగి ఆర్టీసీ డిపోకు 17 బస్సులు మంజూరైనట్లు స్థానిక ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం పరిగి బస్టాండ్‌లో ఐదు కొత్త బస్సులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిగి–షాద్‌నగర్ రూట్‌లో రెండు, పరిగి–మహబూబ్‌నగర్ రూట్‌లో రెండు, హైదరాబాద్ రూట్‌లో ఒకటి కొత్త బస్సులు నడిపించనున్నట్లు చెప్పారు. గతంలో ఎమ్మెల్యే నిధుల నుంచి బస్ బేస్, మరుగుదొడ్లు, బస్టాండ్‌లో సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టినట్లు గుర్తు చేశారు. రెండు నెలల క్రితం నాలుగు బస్సులు ప్రారంభించగా, నేడు ఐదు బస్సులు ప్రారంభించామని, త్వరలోనే మిగతా బస్సులు వస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించడం చాలా సంతోషంగా ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులను ఆహ్వానించి ప్రాజెక్టు నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ఐదు లక్షల మంది యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో రాజీవ్ యువ వికాసం పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారన్నారు. వికారాబాద్–పరిగి–కృష్ణా రైల్వేలైన్ సర్వే పూర్తయిందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిద్ధాంతి పార్థసారథి, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, వైస్ చైర్మన్ అయూబ్, ఆర్టీసీ డిపో మేనేజర్ కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ..



వికారాబాద్, మార్చి 20 : తెలంగాణ పంచాయతీ కార్యదర్శులు సెంట్రల్ ఫోరం డైరీ, క్యాలెండర్‌ను గురువారం వికారాబాద్ క్యాంపు కార్యాలయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో వికారాబాద్ జిల్లా అధ్యక్ష– కార్యదర్శులు శివ కుమార్ , అజ్మత్ తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం జిల్లా అధ్యక్షులు కె మధుకర్ రెడ్డి, కార్యదర్శి ఎస్ ఎం రామ్ విహార్, మల్లేశ్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్, అసోసియేట్ అధ్యక్షుడు ఎం వేమారెడ్డి, ట్రెజరీ మల్లేశం, జాయింట్ సెక్రెటరీ కృష్ణయ్య, విశ్వ తేజ, మారుతి, కార్తీక్, శివ సాయి రాఘవ, శ్రీనివాస్, రవికుమార్, బాల్‌రాజ్, కిషన్ రెడ్డి, రాఘవేందర్, ఆరిఫ్‌ఖాన్, మహిళా కార్యదర్శిలు సుమలత, మమత తదితరులు ఉన్నారు.

### ఇఫ్తార్ విందులో పాల్గొన్న స్పీకర్

వికారాబాద్ పట్టణంలోని మధు కాలనీ మదర్సాలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో స్పీకరవ గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు. పట్టణానికి చెందిన మైనారిటీ నాయకుడు కరీం ఏర్పాటు చేసిన ఈ ఇఫ్తార్ విందులో ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లిం సోదరులకు ఖర్జూర తినిపించి ఉపవాస దీక్షను విరమింపచేశారు. స్థానిక మాజీ కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేశ్‌కుమార్, మండల అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, నాయకులు హఫీజ్, కిషన్‌నాయక్ తదితరులుఈ ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

# తాగు నీటికి కటకట..

■ కాలిపోయిన రెండు బోరు మోటార్లు ■ సయ్యద్‌పల్లి గ్రామంలో రెండు కాలనీల్లో సమస్య



పరిగి, మార్చి 20 : పరిగి మండలంలోని సయ్యద్‌పల్లి గ్రామంలో తాగు నీటి సరఫరాకు సంబంధించి రెండు బోరు మోటార్లు కాలిపోయి ఆయా కాలనీల వారు నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో మిషన్ భగీరథ నీటి సరఫరాతోపాటు డైరెక్ట్ పంపింగ్ సిస్టమ్ ద్వారా పలు బోర్లకు మోటార్లు ఏర్పాటుచేసి గ్రామస్తులకు నీటి సరఫరా చేస్తున్నారు. ఇటీవలి కాలంలో మిషన్ భగీరథ నీటి సరఫరా చాలావరకు తగ్గిపోయింది. దీంతో గ్రామంలోని బోర్లు తాగునీటి సరఫరాలో కీలకపాత్ర వహిస్తున్నాయి. ఇదిలావుండగా కొద్ది రోజుల క్రితం కొత్త కాలనీ, కుర్వ కాలనీలలోని రెండు బోరుమోటార్లు చెడిపోయాయి. దీంతో ఈ రెండు ప్రాంతాలతోపాటు చుట్టుపక్కల వారు నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త కాలనీలో సుమారు 30 కుటుంబాలు, కుర్వ కాలనీలో సుమారు 25 కుటుంబాలకు ఈ బోర్ల ద్వారానే నీటి సరఫరా జరుగుతుండేది. కొద్ది రోజుల క్రితం ఈ బోర్ల మోటార్లు కాలిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోగా పక్కనే గల మరో ప్రాంతంలో గల బోర్ల నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. ఇదిలావుండగా సింగిల్ ఫేజ్ బోరు మోటార్లు ఒకసారి కాలిపోతే మరమ్మతు చేయించవచ్చు. రెండవసారి కాలిపోతే కొత్త మోటారు బిగించాల్సి ఉంటుంది. కొత్త మోటారు ఏర్పాటుకు ఒక్కోదానికి రూ. 20వేలు ఖర్చవుతుంది. ఇదిలావుండగా బోరు మోటారు మరమ్మతులకు గ్రామపంచాయతీలో నిధులు లేకపోవడం, ఇప్పటివరకు కార్యదర్శులు ఖర్చు చేసిన డబ్బులు రాకపోవడంతోనే మోటార్ల మరమ్మతు పనులు చేయించలేకపోతున్నట్లు తెలిసింది. గ్రామంలో బోరు మోటార్లు కాలిపోయిన విషయం అధికారులకు చెబితే కార్యదర్శులు చేయిస్తారులే అని సమాధానాలు ఇవ్వడం తప్ప గ్రామానికి వచ్చి చూసి బాగు చేయించిన దాఖలాలు లేవు. సయ్యద్‌పల్లిలోని రెండుమూడు ప్రాంతాలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్న దృష్ట్యా ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే బోరు మోటార్లు బాగు చేయించాలని ఆయా కాలనీల వారు కోరుతున్నారు.

# 'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



ధారూరు: కేరెళ్లి జడ్పీ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రం

పరిగి, మార్చి 20: నేటి నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలకు విద్యా శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. పరిగిలో 7 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా పరీక్షల నిర్వహణకు 106 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ఈ పరీక్షా కేంద్రాలలో మొత్తం 1950 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరిగిలోని జెడ్పీ హెచ్ఎస్ నెం.1 పరీక్షా కేంద్రంలో 250 మంది విద్యార్థులు, జెడ్పీ హెచ్ఎస్ నెం.2లో 250 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 250 మంది, టీజీఎస్‌డబ్ల్యుఆర్ఈఐఎస్ బాలురలో 245 మంది, సెయింట్ గానస‌లో గార్సియా పాఠశాలలో 328 మంది, క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో 307 మంది, న్యూ బ్రిలియంట్ స్కూల్‌లో 320 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవనున్నట్లు ఎంఈవో తెలిపారు.

**ధారూరు:** మండల పరిధిలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ధారూరు మండల కేంద్రంలోని పరీక్షా కేంద్రంలో 151మంది విద్యార్థులు, కెరెళ్లి పరీక్షా కేంద్రంలో 141మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

**బంట్వారం(కోట్‌పల్లి):** పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఈవో చంద్రప్ప పేర్కొన్నారు. గురువారం కోట్‌పల్లి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఆయన ఇన్విజిలేటర్లతో సమావేశం నిర్వహించారు.అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... స్థానిక జడ్పీహెచ్ఎస్ లో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ పరీక్షా కేంద్రంలో 187 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవనున్నట్లు చెప్పారు. బంట్వారం మండల కేంద్రంలోని మాడల్ స్కూల్‌లో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ఇందులో 201 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈవో వెంకటేశ్వర్‌రావు చెప్పారు. పరీక్షకు హాజరుకానున్న విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా హెల్ప్‌లైన్ కొరకు 9492357100 ఫోన్ చేయా లని ఆయన చెప్పారు.

**మర్పల్లి:** మండలంలోని వివిధ గ్రామాలలోని 16 పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న 402 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈవో అంజిలయ్య తెలిపారు. జడ్పీ ఉన్నత పాఠశాల, ఉర్దూ మీడియం పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.

## అభివృద్ధి పనులు మంజూరు చేయాలని వినతి



బొంరాస్‌పేట్, మార్చి20: కొడంగల్ కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డికి వడిచర్ల గ్రామనాయకులు గోపాల్‌రెడ్డి,రాములు అభివృద్ధి పనులను మంజూరు చేయలంటూ వినతిపత్రం అందించారు. వడిచర్ల పాఠశాల ప్రహరీ,పాఠశాలలో వంటగది, వడిచర్ల నుంచి గోరేపల్లి వరకు బీటీ రోడ్డు వంటి అభివృద్ధి పనులను మంజూరు చేయలన్నారు. కార్యక్రమంలో కృష్ణయ్య, అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు యూనిక్ డిజేబిలిటీ కార్డులు



సిటీబ్యూరో, మార్చి20 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లాలో ఉన్న దివ్యాంగుల కోసం జారీ చేసే యూనిక్ డిజెబిలిటీ ఐడెంటి కార్డుల గురించి జిల్లాలోని దివ్యాంగుల ప్రతినిధులతో జిల్లా రెవెన్యూ అధికారి ఈ. వెంకటాచారి గురువారం సమావేశం నిర్వహించారు. ఈ కార్డు కొత్తగా ఇస్తున్నందున అనుమానాల నివృత్తికోసం కలెక్టరెట్‌లో ఒక సెల్‌ను ఏర్పాటు చేస్తామని, ఎలాంటి అవకతవకలు లేకుండా జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ సహాయ సంచాలకులు రాజేందర్, సి సెక్షన్ సూపరింటెండెంట్ సునీత, దివ్యాంగ ప్రతినిధులు పాల్గొన్నారు.

## తైబజార్ వేలం..

కొడంగల్, మార్చి20 : కొడంగల్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఆధ్వర్యంలో గురువారం తైబజార్ వేలం నిర్వహించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ వేలం నిర్వహించారు. పోటాపోటీగా జరిగిన వేలంలో కొడంగల్‌కు చెందిన నీలకంఠం అనే వ్యక్తి 12.70లక్షలకు దక్కించుకున్నారు. గత ఏడాది 7.26 లక్షలు పలికిందని ఈ సంవత్సరం 5.44 లక్షలు అదనంగా ఆదాయం వచ్చినట్లు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఆంజనేయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### తాగు నీటికి ప్రత్యేక చర్యలు



దోమ, మార్చి 20: మండల పరిధిలోని అయినాపూర్ గ్రామంలో కొద్ది రోజులుగా బోరు మోటర్ పాడవడంతో తాగు నీటికి ఇబ్బంది ఏర్పడింది. మహిళలు ఖాళీ కడవలతో గ్రామ పంచాయతీని ముట్టడించిన సంగతి విధితమే. తదనుగుణంగా తాగు నీటి నివారణ నిమిత్తం గురువారం బోరు బావిలో కొత్త మోటర్, పంపులను ఏర్పాటు చేసినట్లు పంచాయితీ కార్యదర్శి నరేందర్ గౌడ్ తెలిపారు.ఈ కార్య క్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేందర్ గౌడ్, మెకానిక్ మొగులయ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# దీనస్థితిలో పల్లెప్రకృతి వనాలు

### సంరక్షణ కరువై ఎండిపోతున్న వైనం

బొంరాస్‌పేట్, మార్చి20 : బొంరాస్‌పేట్, దుద్యాల్ మండలాల పరిధిలోని 53 గ్రామంచాయతీలలో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాలు సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఎండిపోతున్నాయి. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో ప్రజల సౌకర్యం కోసం ఏర్పాటుచేసిన పల్లెప్రకృతి వనాలు నాడు పచ్చగా కళకళ లాడుతూ ఉండేవి కానీ నేడు కళాహీనంగా, దీనస్థితికి చేరుకున్నాయి గ్రామాలలో సాయంత్రం సమయంలో వృద్ధులు, చిన్నపిల్లలు పచ్చని చెట్ల మధ్య గడిపేవారు. పెద్దవారితో కలిసి చిన్నపిల్లలు అక్కడ ఏర్పాటు చేసిన సిమెంట్ కుర్చీలపై కొంతసేపు కూర్చునే వారు.చెట్లకు క్రమం తప్పకుండా నీళ్లు అందించి వాటి సంరక్షణను చూసుకుంటూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే వారు. నేడు పల్లెప్రకృతి వనాలు పూర్తిగా ప్రజలకు ఉపయోగ పడడం లేదు. వృద్ధులు, చిన్నపిల్లలు అక్కడికి వెళ్లి నడిచేందుకు కూడా వీలులేకుండా చెత్త, దుమ్ముతో నిండిపోయాయి. చెట్లకు నీరు లేకపోవడంతో ఎండిపోయి కళాహీనంగా మారడంతో పాటు చెట్ల మధ్యలో కలుపుమొక్కలు,గడ్డి పెరిగిపోవడంతో అందులోకి వెళ్లేందుకు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఉంది.

#### పూర్వవైభవం తీసుకురావాలి



గ్రామంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాలు నాడు పచ్చగా ఉం డడంతో చిన్నారులు, పెద్దలు అక్కడికి వెళ్లి నడక చేసేవారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు అవుతున్న వాటి సంరక్షణ చూడకపోవడంతో పనికి రాకుండా తయారు అయ్యాయి.క్రమం తప్పకుండా నీరు అందించి ప్రకృతివనంలో ఉన్న చెత్తను తొలగించాలి

– కోడి వెంకటయ్య, చౌదర్‌పల్లి

#### ప్రకృతి వనాలను సంరక్షించాలి



నాడు పచ్చగా ఉన్న ప్రకృతివనాలు నేడు ఎండిపోతున్నాయి. నడకను కొనసాగించేందుకు గ్రామ ప్రజలకు ఇబ్బందిగా ఉంది. ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా మొక్కలకు నీరు అందించే వీలున్నా కూడా ఎందుకు అందించడంలేదు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మానవాళి మనుగడకు మొక్కల పెంపకం చాలా ముఖ్యం.

–దోమ అంజిలయ్య, చౌదర్‌పల్లి

## ఎంబీబీఎస్ విద్యార్థినికి ఆర్థిక చేయూత



సుంకరి శ్రీలక్ష్మీకి రూ.50వేలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి, మార్చి 20 : పరిగి మండలం లక్నాపూర్ గ్రామానికి చెందిన సుంకరి శ్రీనివాస్ కూతురు సుంకరి శ్రీలక్ష్మి కామినేని మెడికల్ కళాశాలలో ఉచితంగా ఎంబీబీఎస్ సీటు సాధించగా, ఆమె చదువుకు తోడ్పాటుగా కొప్పుల హరీశ్వర్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి రూ.50వేలు అందజేశారు. శ్రీలక్ష్మి ట్యూషన్ ఫీజు నిమిత్తం అవసరమైన రూ.50వేలు మాజీ ఎమ్మెల్యే గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మాజీ ఎంపీపీ అరవిందరావు, మాజీ మార్కెట్ చైర్మన్ ఎ.సురేందర్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆర్.ఆంజనేయులు, సీనియర్ నాయకులు బి.ప్రవీణ్‌కు మార్ రెడ్డి, నాయకులు ఎదిరె కృష్ణ, మాణిక్యం, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## కంకర వేశారు.. బీటీ మరిచారు



బొంరాస్‌పేట్, మార్చి20 : కుదురుమళ్ల గ్రామం నుంచి దుద్యాల్ మీదుగా హకీంపేట్ గ్రామం వరకు 17 కిలోమీటర్లు రెండు వరుసల బీటీ రోడ్డు పనులకు రూ. 50 కోట్లుప్రభుత్వం మంజూరు చేసింది. పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్ మొత్తం కంకర పరిచాడు బీటీ వేయడం మాత్రం మరిచారు. దీంతో ద్విచక్ర వాహనదారులు, పొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనదారులు పలుమార్లు తమ వాహనం అదుపుతప్పి కిందపడుతున్నారు. బీటీ పనులను వెంటనే పూర్తిచేయాలని అయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## క్విజ్‌పోటీల్లో ప్రథమ బహుమతి



పరిగి, మార్చి 20ః శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం కాంప్లెక్స్ స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీలలో పరిగి మండలం గడిసింగాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. ఈ మేరకు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అనంతరావు విద్యార్థులకు బహుమతి, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### రాజ్‌భవన్‌లో విశ్వసుందరీల అందాలను ప్రశంసిస్తారా?

సిటీబ్యూరో, మార్చి 20 ( నమస్తే తెలంగాణ): మిస్ వరల్డ్ అందాల పోటీల పేరున హిందువుల పుణ్యక్షేత్రాలైన యాదగిరిగుట్ట, రామప్ప దేవాలయ పరిసరాల్లో ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించినా హిందూ సమాజం అడ్డుకుంటుందని యాంటీ టెర్రరిజం ఫోరం చైర్మన్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ్ సమితి సెక్రటరీ డాక్టర్ రావినూతల శశిధర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జూన్ 2వ తేదీన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన రోజని, విద్యార్థులు, యువత ఆత్మ బలిదానాలు, త్యాగాలు చేసి రాష్ట్రాన్ని సాధించుకున్న రోజు అని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2న రాజ్‌భవన్‌లో మిస్ వరల్డ్ మీట్ కార్యక్ర మం నిర్వహించడం దారుణమని చెప్పారు. ఆరోజు తెలంగాణ చరిత్ర, రాష్ట్ర ఏర్పాటు త్యాగాలు స్మరించుకోవాల్సినరోజన్నా రు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-330663-All

SHORT TERM COACHING

★ Sri Chaitanya Junior College, Uppal: 45 Days BiPC NEET and MPC EAMCET. Contact: K.Ashok Reddy, AO. 9441884705.
NT-MBNR

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962